క్రొత్త జాడ్యం

ఈ మధ్యనే ఓ క్రొత్తరకం జాడ్యం ప్రపంచంలో ప్రవేశించినట్టూ, బర బరా ప్రాకిపోతున్నట్టూ పసికట్టబడింది. అంతర్జాతీయంగానూ, జాతీయంగానూ, స్థానికంగానూ సైతం యీ వ్యాధి నాగుజెముడు తెగులు కంటే కూడా మహావేగంగా వ్యాపించుతోందట!

సామ్రాజ్యవాదుల, వారి వంశీయుల, గోత్రీకుల రక్తనాళాలు యీ వ్యాధి ప్రవేశానికీ, అభివృద్ధికీ అస్కారమిస్తున్నట్టు ఆధారాలు కూడా అనంతంగానే దొరికాయట!

ఈ వ్యాధి ఎప్పుడు, ఎక్కడ, ఎలా ప్రారంభమయిందీ సవివరంగా పేర్కొనడం అంత సులభంకాకపోయినా లభ్యం మాత్రం అవును.

అసలీ జాడ్యంయొక్క జన్మస్థానం అమెరికా అనీ, అచిరకాలంలోనే అన్ని దేశాలకూ చర చరా అంటుకొంటూ — ఆఖరుకు సాత్విక, ఆధ్యాత్మిక, అహింసలకు పురిటిగడ్డ అయినటువంటి పుణ్య భారతభూమిని కూడా పులుముకుని అలముకొంటున్నదనీ అనడానికి ఆవకాశాలు అనేకం.

ముప్పైనాలుగు

ప్రప్రథమంగా యీ వ్యాధిని గురించిన భోగట్టా ప్రపంచానికి పరిచయం కావడంలో బహుగా పనికివచ్చిన పవిత్రమూర్తి మిస్టర్ ఫారెస్టాల్. ఆయన పేరుతోనే దీనికి 'ఫారెస్టాల్ జాడ్యం' అన్న పేరు స్థిరపడిపోయింది.

మిస్టర్ ఫారెస్టాల్ అంటే అమెరికా ప్రభుత్వ రక్షణశాఖా కార్యదర్శి. సోవియట్ రష్యాకు వ్యతిరేకంగా యుద్ధాన్ని కొనసాగించటానికి బ్రహ్మాండమైన వ్యూహాన్ని తయారుచేసిన ప్రముఖుడు, పెద్ద ఎత్తున మారణాయుధాల ఉత్పత్తిని తన ఆధిపత్యానే సాగించినవ్యక్తి. ప్రపంచమంతటా, మారుమూల దేశాలలో సైతం సోవియట్‌పై దాడికి కీలకస్థావరాలు సంపాదించడానికి నడుంకట్టినవాడు. అలాంటి ప్రముఖవ్యక్తి — పాపం!

"మిస్టర్ ఫారెస్టాల్‌కు మతిపోయింది. గతకొద్ది వారాలనుండీ దాని చిహ్నాలు కనబడుతున్నాయి...... ఎర్రసైన్యం- అని ఏదో సంధించినట్టు గోల మొదలుపెట్టాడు. ఎంతో అతికష్టంమీద అతన్ని పట్టుకొని ఇంట్లోకి తెచ్చారు..."

అమెరికన్ రేడియోలో
1949 ఏప్రిల్ 10 న.
డ్రూపియర్సన్ ప్రసంగంనుంచి

అసలు విషయం ఏమంటే - మిస్టర్ ఫారెస్టాల్‌కు ఏదో ఓ శుభముహూర్తాన ఆకస్మికంగా ఒక పిడుగులాంటి వార్త బుర్రలో ప్రవేశించింది. 'అమెరికా మీాద రష్యన్లు బ్రహ్మాండమైన దాడి ప్రారంభించార'ని అతని తలలో జిగేల్‌మని మెరసినట్టయింది. దీనికి కారణం విచారించగా బజార్లో ఫైర్ సైరన్లు మోగడమేనని తెలియవచ్చింది. ఆ తక్షణమే ప్రక్కమీాదినుంచి ఎగిరి పడ్డాడు. పట్టుకోవడం సైతం కష్టమయింది. యింతలో సైరన్ రెండోసారి మోగింది. యికనేం? ఫారేస్టాల్ బాజార్న పడ్డాడు. ఎర్రసైన్యం ఎర్రసైన్యం అని గోలకు లంకించుకున్నాడు. ఎంతో అతికష్టంమీాద అతన్ని పట్టుకుని యింట్లోకి తెచ్చారు...

అయితేనేం? ఆ తర్వాత పధ్నాలుగు అంతస్థుల హాస్పిటల్‌మీాదినించి అమాంతం పరిగెత్తబోయి అక్కడినుంచే క్రింద పడ్డాడు.

'పాపం శపించుగాత!'

ప్రభువునందు నిద్రించేందుకు పరలోకం వెళిపోయాడు.

పోతూపోతూ నాగజెముడు తెగులులాంటి యీ వ్యాధినిమాత్రం ప్రపంచంమీాదికి వదిలి తన వంశ వినాశనానికి పునాదులువేసి పోయాడు.

ఇది అంతర్జాతియం.

యిక- బోల్షివిక్ భూతాల పేరుతో గాభరా పడి గంతులువేసి, గల్లంతౌతున్న యిలాంటి కేసులు జాతీయంగా కూడా అనేకం పరిశోధించబడ్డాయి. అవన్నీ కాక మచ్చు కొక్కటి మాత్రమే -

ఆ మధ్యనే ఒక మంత్రిగారు చికిత్స నిమిత్తం ఊటీకి వెళ్లారు. ఆ డాక్టరు 'ఇది పొరెస్టాల్ జాడ్యం' అనీ, ఆ భూతాల విషయం పూర్తిగా మరచిపోయి ఆ యా నందనవనాల సహజ సౌందర్యంపై ఆలోచనల్ని కేంద్రీకరించమని సలహా చెప్పాడు.

మరునాటి వుదయమే మంత్రిగారు వాహ్యాళి వెడలారు. కాని కొద్ది క్షణాలలోనే మంత్రిశేఖరుని నోటినుంచి నురుగుదొబ్బలు బయలువెడలసాగాయి. వంటినుంచి చెమటలు కురుస్తున్నాయి. ఎదురుగా తోట మాలి వంగి వంగి వస్తున్నాడు. 'ఇదేమి ఖర్మా!' అని.

'ఆఁ - ఆఁ - హంతకుడు - హంతకుడు' పెడ బొబ్బలుపెట్టారు మంత్రిసత్తములు.

'పులీస్ - పోలీస్ - ' సర్వాయుధ సపరివార సమేతంగా హుటాహుటీవచ్చి వాలారు. మరి ప్రజా మంత్రిగదా? వాలీ వాలడమే తోటచుట్టు ముట్టారు. చెట్టూ, పుట్టా, పొద, ఒకటా! సర్వం కళ్ళతో దున్నే శారు. పట్టు పట్టుమని 'ప్రముఖహంతకుడు' తోటమాలిని పట్టేశారు. మంత్రిగారిని మంచంమీదికి మోశారు.

హంతకుడిమీద అర్జంటు చార్జి బనాయిస్తున్నారు. కాగితాలు కాగితాలు వ్రాసేస్తున్నారు.

కళ్లు కాస్త కాస్త తెరుస్తున్నారు మంత్రిగారు.

"ఆఁ- ఆఁ- ఆఁ-" వణికిపోతున్నారు మంత్రిగారు.

వ్రాస్తున్న పెద్దమనిషి వామహస్తం వ్రాతగాడు. వంచిన తల ఎత్తకుండా ఎడమచేత్తో గిలుక్కుపోతున్నాడు.

చూచాడు. చూచాడు మంత్రిగారు. ఎవరో వామపక్షాలకు చెందిన వాళ్లు చుట్టు ముట్టినట్టేవుంది. చేజాడు ధైర్యం మంత్రిగారు. వామ పక్షవలయాన్నించి బయట పడాలని చూచారు. మూసుకున్నారు కళ్లు. దూసుకున్నారు, ఒక్కదూకులో గొందివాకిట్నపడి -

'వామపక్షం-వామపక్షం' - అని అరుచుకొంటూ-

'ఎక్కడ ? ఏరి ?' వెతికాడు. ఎడమచేతివ్రాతగాడు తనను మినహాయించి మొత్తాన్నీ. సిబ్బంది సిబ్బంది మొత్తం తెల్ల మొగాలు వేసుకు చస్తున్నారు.

"ఏదీ ? ఏరి ? వామపక్షం. ఎక్కడ ?"

ప్రమాదం ఏమిటో తోచనేలేదు వాళ్లకి. ప్రముఖ బోల్షివిక్ హంతకుడు తోటమాలి తమతోనే

వున్నాడా యే-సంకెళ్ళుకూడా అలాగేవుండే-. ఆలోచిస్తు న్నారు.

అలాగని ఆలోచిస్తూ వూరుకొంటూరా? ఆలోచించడానికా? వాళ్లకి ప్రభుత్వం అంతలేసి జీతాలీయడం. ఆలోచన మానేసి ఆజ్ఞలు ఆచరించడానికి ఆచారప్రకారం అంతా అక్షౌక్షణాలోంచి బయల్దేరి అన్ని వైపులా పొదలూ పుట్రలూ గాలిస్తూ కంచెలన్నీ తెగ దిరుగుతున్నారు. ఏం జరిగిందో, ఏం జరుగుతోందో, ఏం జరగనుందో వాళ్ల కేమీ తెలీయదు.

యింతలో ఓ వైపునుంచి రొప్పుతూ రోజు తోన్న మహాధ్వని వినవచ్చింది. ఆ ధ్వనినిబట్టి పోయి చూస్తే మంత్రిగారు యువకోత్సాహంతో, దీర్ఘ శ్రమానంతరం పొందిన అలసటతో, దుడ్డుకర్రమీద గడ్డం మోపి, శరీర భారాన్నంతా దానిమీద వదిలేసి చమటలు కక్కుతూండడం గమనించబడింది. ఆ చుట్టూవున్న ఎర్రగులాబి పొదలు, ఎర్రగన్నేరు చెట్లు మందార పందిళ్లు అన్నీ సమూలంగా ఛేదించబడి నేల కరుచుకొని వున్నాయి. అంతమేరా ఆకాశంలో గులాబీ, మందారా పూ రేకులు గాలిలో తూనీగల్లా ఎగురుతున్నాయి.

మంత్రిగారిని చూ స్తే అంత సిబ్బందికీ హడ లెత్తింది.

మంత్రిగారు దుడ్డుకర్రను దూరంగా విసిరి

పారేశారు. హుటా హుటీ భవనంలోకి వెళ్లిపోయారు. టెలిఫోన్ నిర్విరామంగా గంటలకొద్దీ మోగింది. పత్రికా విలేఖరులు గుంపులు గుంపులుగా వచ్చారూ, పోయారు.

ఘర్నాటి పత్రికలలో గుమ్మడికాయలంత పతాక శీర్షికలలో — 'ఎర్రదయ్యాలు తనని చంపడానికి పన్ని నకుట్రల్ని ఎంతధైర్యోపేతంగా, ఎలా ఏకాకిగా, విజయ వంతంగా, భగ్నం చేశారో—' అదంతా సవివరంగా పేజీ లకు పేజీలు వార్తలు దేశాన్ని కప్పివేశాయి. కొన్ని పత్రికలు ప్రత్యేక సచిత్ర సంచికలు సైతం ప్రకటించాయి.

ఆ తర్వాత వారం రోజుల్లో గొప్ప మేజర్ జనరల్ నాయకత్వాన ఎర్రదయ్యాల వేటకు ప్లానులు సిద్ధమయ్యాయి. అన్ని జాతుల, ఎర్రపూలు, కాయ గూరలు నాశనం కావించడానికి జైత్రయాత్రకు ఓ ముహూర్తాన ప్రారంభోత్సవం జరిగింది.

ఆ తర్వాత మరో వారానికి 'ఎరుపు' అనే పదాన్ని నిషేధిస్తూ అత్యవసర ఆర్డినెన్సు జారీచేయ బడింది.

ఇతి జాతీయం.

*　　*　　*

ఈ ఘోరప్రమాదాలతో కూడిన జాడ్యమే, ఆంధ్రా వనిలో కూడా, వాడవాడలా, వారి భూస్వామ్యసోదరులను

లంకించుకొని తీవ్రవ్యాధిగా వేధిస్తున్నట్టు అనేక రిపోర్టు లున్నాయి. ఉదాహరణకు :- ఓ రిపోర్టు

... గ్రామం-'క'. కాలం-1949 జూన్.

విషయం — ఈ గ్రామపరిసరమంతా ఎర్ర ప్రమాదం జాస్తిగా వున్నట్టు ఎప్పుడోకని పెట్టబడింది. అందుకైన అత్యావసర చర్యలు అర్జంటు అర్జంటుగా తీసు కోబడి 'ఎర్ర' అనబడే సమస్తమూ; ఆ ఆలోచనా సహి తంగా దుంపనాశనంకావించబడి విజయస్తంభమునాటిన గ్రామాలలో యీ 'క' ప్రధాన గ్రామం.

సదరు విజయోత్సవాలసందర్భంగానే — ఈ దుంపనాశనానికి అనాదిపునాది నాయకుడైన శ్రీతల్లివేరు గార్ని ఈ 'క' గ్రామంలోని పిల్లవేరులు సన్మానించేం దుకై ఆహ్వానించారు. పంచభక్ష్యపరమాన్నాలతో విందులూ విడ్దూరాలూ జరిపారు. ఆ రాత్రి గడిచి తెల్ల వారినాక చూడగా శ్రీతల్లివేరులుంగారు ఎవరితోనూ చెప్పనైనా చెప్పకుండా స్వర్గానికివెళ్ళిపోయినట్టుతేలింది, అసలువిషయాన్ని అన్నిఆధారాలతో పరిశీలించినమీదటి సారాంశం ప్రకారం —

...ఆరాత్రి శ్రీతల్లివేరు అయ్యావారు-చుట్టూ సపరివార పహారాలతో సురక్షితమనుకున్న భవనంలో విశ్రమించినారనిన్నీ; యికబయటపిల్లవేరు సేవాదళాలు - నాయకులు పెట్టినభయంతో గుండెలుగుప్పిళ్లల్లోపట్టుకుని,

గుడ్లు రెప్పల్లో పెట్టుకుని మూక ధైర్యంతో వెన్నుతట్టుకుంటూ, ఎర్రదయ్యాలు ఎటునుంచివచ్చిపడతాయోననే పీచుపీచుభయంతో నిద్రపోతూన్న కమాండరు ఆధిపత్యాన కాచుకొంటూనేవున్నారనిన్నీ; అయితే-

అలాంటి సమయంలో రెండుగంటలరాత్రప్పుడు గాఢనిద్రలో కాపలాను పర్యవేక్షిస్తూన్న కమాండరు గుండెలమీద గుభీమని ఎర్రదయ్యం దూకినట్టయిందనిన్నీ; సదరు కమాండరు గోండ్రిపెడుతూ ప్రక్కనేవున్న ఆయుధాన్ని పఢేలునఅందుకొని అతిత్వరితంగా ఆజ్ఞలు జారీచేస్తూ ఆ తందరలో ఆయుధం ఎటువున్నదికూడా చూచుకునేవ్యవధిచాలక ఆపాళ్న పేల్చుకుని కాల్చుకున్నారనిన్నీ; ఆమోతకు కళ్ళింతలూ తుళ్ళింతలూపడ్డ దళ సభ్యులంతా ఎవడికివాడే ఎదటివాణ్ణి ఎర్రదయ్యంగా ఎంచుకుని గోలగోలగా తాము క్రొత్తగానేర్చుకున్న విద్యాప్రదర్శనం సాగించారనిన్నీ; పోతే-

యీస్థితిలో లోపలి అయ్యవారు బయటితొక్కిడికి కంగారుపడి లేచి వాకిళ్లు కానరాక పారిపోయేదారి లేక ఆశోపహతులై మంచాన్ని కావిలించుకుని బావురుమన్నారనీ; ఏడుపూఎక్కిళ్లూ పెనవేసుకుని వచ్చిపడి ఉక్కిరిబిక్కిరై 'హాఁమ్మ'ని-ఆవులించారనిన్నీ; అదేఆఖరి ఆవలింతనిన్నీ; అభిజ్ఞవర్గాలవారి అంచనాలననుసరించి ధృవపరచబడింది. శవపంచాయతీ రిపోర్టులో అవసరార్థమై

ఎర్రిదయ్యాలు చంపినట్టు వేరుగా వ్రాయవలసివచ్చినా-అసలు నిజమైన రిపోర్టుమాత్రం పైన వుదహరించినదేనని గమనించేది.

ఇతి స్థానికం.

◆ ◆ ◆ ◆

ఈజాడ్యమే మరోజిల్లాలోని 'అ' అనేగ్రామం లోకూడా ఒకర్నిసోకి మరోరూపంలో పీడించింది.

'అ' గ్రామంలో కేశవులు అనే భూస్వామి వున్నాడట. ఒకానొకనాటిరాత్రి, ఆయన చాలా ప్రొద్దుపోయేవరకూ ఎర్రిదయ్యాలను హతమార్చడానికి అభేద్యమైన ప్లానులు చర్చించిచర్చించి కొంపకు చేరుకొన్నాడట. తలుపులన్నీ బిగించి, ఇనపగళ్లువేసి, ఒకసారిమళ్లీ అన్నీ సరిచూచి పందిరిమంచంమీదికిచేరి పరుపులు పైకిలాక్కొని మరీపరున్నాడట. ఎర్రిదయ్యాలు ఒకవేళవచ్చి పడ్డా మొదటిదెబ్బలు పరుపుకే తగుల్తాయని-

మరోగుంటలో ఎంతోదూరంనించి వచ్చిన దగ్గరబంధువులు వర్షాన్ని వెంటబెట్టుకువచ్చారు. వచ్చి తలుపులుతట్టడం కేకలుపెట్టడం సాగించారు. వాళ్లురావడంఐతే-వీరి పుత్రిరత్నానికి పెళ్లిసంబంధంకోసరం వచ్చారుట. ఈయనమాత్రం ఎర్రిదయ్యాలు తనపెళ్లికే వచ్చాయని హడిలిపోయాడు. అంతెఎత్తు పందిరిమంచంమీది

నుంచీ దూకి భయంతో భార్యను చాటుచేసుకోబోయాడు. కాని మరొకటిచేసుకున్నాడు. గుడ్డలన్నీ తడిసిముద్దైపోయాయి, చెడుగబులుకొట్టాయి. చుట్టూపట్టూ, అయినవాళ్లూ, వచ్చి 'యిదండీసంగతీ' అన్నా నమ్మడే!

హాస్పిటల్‌లోచేర్చారు. ఐనా బెడ్ మీద దుప్పట్లు గంట కొకటీరెండూ మార్చాల్సివస్తున్నాయి. పక్కనే వుండేవాళ్ళముక్కులు బద్దలుకొట్టుకుపోతున్నాయి.

ఇతి సర్వేసర్వత్రాం

కలంతాజా:- మనఢిల్లీ, మద్రాస్, కర్నూలు హైదరాబాద్ వగైరా రాజభవనాల్లోసైతం యిది అప్పుడప్పుడూసోకడం - శివాలూచిందులూ పెట్టించడం సర్వసాధారణంగా జరిగేవిషయం.

గమనిక :- యిలా యీ వ్యాధిప్రవేశించడం ఒకేవిధంగా జరుగుతున్నా, పరిణామంలో రకరకాలుగా పట్టిపీడించుకుతింటోంది. యింతవరకూ యీ జాడ్యానికి మందుకనిపెట్టినవాళ్లు కన్పించడంలేదు. — 'నభూతో నభవిష్యతి : కూడానట. ఎలాగంటే—

యీ వ్యాధినివారణకై పరిశోధనలూ ప్రయోగాలూ సాగించిన ప్రముఖవేత్తలంతా ఏకకంఠంతో ఓ

నివేదికను ప్రకటించారు. అందులో — 'సామ్రాజ్యవాదులూ, వారివారి వంశీకులూ, వారి ఆచారాలూ, యీప్రపంచంలోవున్నంతకాలమూ యీ జాడ్యాన్ని నివారించే తరుణోపాయంలేదనీ; అది అంతమైతేనే యీవ్యాధి అంతమౌనాననీ, యీ నివేదికకు తిరుగులేదనీ చెప్పేశారు.